ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 8 ఫిబ్రవరి 2024








ప్చ్..నిరాశే

బాపట్ల జిల్లాకు దక్కని ప్రాధాన్యం

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుంది. పలు కార్యాలయాల్లో మౌలిక వసతుల కొరత వెంటాడుతూనే ఉంది. జిల్లా అయితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా కొత్త పుంతలు తొక్కుతుందని ఆశలు పెట్టుకున్న నిరుద్యోగుల ఆశ రెండేళ్లుగా నెరవేరలేదు. జిల్లా ఆవిర్భవించాక గతేడాది ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కుతుందని ఆశపడిన ప్రజలకు నిరాశే మిగలగా, బుధవారం ప్రవేశపెట్టిన మలి బడ్జెట్ సైతం జిల్లావాసులకు నిరాశనే మిగిల్చింది. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు ఇతోధికంగా నిధులు రాబట్టడంలో పాలకపార్టీ నేతల కృషి నామమాత్రంగా కూడా లేకపోవడంతో వారు ఇచ్చిందే దక్కుదల, వచ్చిందే ప్రాప్తం అన్నట్లుగా ప్రజల పరిస్థితి తయారైంది. సమీకృత కలెక్టరేట్ ప్రతిపాదనలను తొలినాళ్లలో రూపొందించారు. గతేడాది బడ్జెట్‌లో అందుకు సంబంధించి నిధులేవీ కేటాయించకపోవడంతో వాటిని అటకెక్కించారు. ప్రస్తుత బడ్జెట్‌లో అయినా వాటి ఊసు ఉంటుందనుకుంటే అదేమీ కనడడలేదు. జిల్లా పారిశ్రామికంగా ఎదగ డానికి అవకాశం ఉన్న రంగం ఆక్వాపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపు తోంది. పర్చూరు ప్రాంతంలో ఎక్కువగా మిర్చి, డెల్టా ప్రాంతంలో వరి రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక కేటాయింపులేవి బడ్జెట్ పద్దులో కనబడలేదు. గుంటూరు ఛానల్ విస్తరణకు రైతు సంఘాలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నా కేటాయింపులో దాని ఊసే కరువైంది. జిల్లాలో కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయిస్తున్నట్లు గత బడ్జెట్‌లో పొందుపరిచారు. అయితే ఇంతవరకు పైసా విదిల్చిన పాపాన పోలేదు. ఈ ఏడాది పద్దులోనూ ఆ పథకానికి నిరాశే ఎదు రైంది. దాదాపు 5,000 ఎకరాలకు నీరందించే భవనాసి రిజర్వాయర్ పనులకు సంబంధించి కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు. కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు వదిలినప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరడం గగనమైపోయినా పాలకులు పట్టించుకోలేదని బడ్జెట్‌తో అర్థమవుతుంది. గతంలో కలెక్టర్ విజయకృష్ణన్ పర్యాటకరంగం అభివృద్ధికి బాపట్లలో మంచి స్కోప్ ఉందని గుర్తించి 4 కోట్లతో ప్రతి పాదనలు పంపారు. ఆ కొద్ది మొత్తం విడుదలకు కూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. కనీసం ఈ బడ్జెట్‌లో అయినా ఎంతోకొంత వాటా దక్కుతుందను కుంటే ఇక్కడా నిరాశే ఎదురైంది.



పునాదుల్లోనే నిలిచిపోయిన బాపట్ల మెడికల్ కళాశాల



అద్దంకి: చిల్లచెట్లతో మధ్యలో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం

ఎన్నికలకు ముందు బడ్జెట్.. నిధులు వరద.. ప్రత్యేక ప్రాజెక్టుల ప్రకటన.. పాత పనులకు ప్రత్యేక కేటాయింపులు.. అని ఆశించిన వారికి బుగ్గన బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రస్తావన లేకుండానే బడ్జెట్ ప్రవేశ పెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఏ ఒక్క ప్రాజెక్టు కు ఎలాంటి కేటాయింపులు జరపలేదు. గంటకు పైగా సాగిన ఆయన సుదీర్ఘ ప్రసంగంలో ఒకే ఒక్క చోట నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని మాత్రం ప్రస్తావించారు. అంతకు మించి ఎక్కడా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పేరు ప్రస్తావనకు రాలేదు.

- బుగ్గన బడ్జెట్‌లో మొండిచెయి
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు నిధులు నై
- బడ్జెట్ కేటాయింపుల్లో దక్కని ప్రాధాన్యం
- కీలక రంగాలకు నిధుల ఊసే లేకుండా బడ్జెట్
- పల్నాడు, బాపట్ల జిల్లాలపై రెండో ఏడూ శీతకన్నే

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం, నల్లమడ డ్రెయిన్ మోడర్ నైజేషన్, బుగ్గవాగు రిజర్వాయర్, కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడికాలువ ప్రాజెక్టుల పనులకు సంబంధించి నిధుల కేటా యింపు జరపలేదు. బుగ్గన బడ్జెట్‌తో జిల్లా ప్రజానీకానికి ఒరి గేది ఏమి లేదని స్పష్టమైంది. ప్రధానంగా భారీ నీటిపారుదల శాఖకు సంబంధించి కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణకు సంబంధించి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే టెండర్లు జరిగాయి. ఈ ఐదేళ్లలో భూసేకరణ ప్రక్రియ నోటిఫికేషన్ల వరకు మాత్రమే వైసీపీ తీసుకొచ్చిందంటే నీటిపారుదల రంగంపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లం అవుతున్నది. పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం పనులను వైసీపీ ప్రభుత్వం వస్తూనే నిలిపేసింది. వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం అంటూ పేరు మార్చి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిధులు కేటాయిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చింది. తీరా చేతులెత్తేయడంతో నిర్మాణ సంస్థలు కూడా వెనకడుగు వేసి యంత్రపరికరా లన్నింటిని వేరే ప్రాంతానికి తరలించాయి. నాగార్జున సాగర్, కృష్ణా పశ్చిమ డెల్టా కాలు వలపై ఈ ఐదేళ్ల లో నామమాత్రంగానే పనులు జరిగాయి. టీడీపీ హయాంలో అమరావతి నూతన రాజధాని నిర్మాణానికి ఏటా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపేది. వైసీపీ ప్రభుత్వం అమరావతి అనే పదాన్ని తొలగించి నూతన రాజధాని అని పెట్టి కేటాయింపులు జరిపినా ఇక్కడ ఎలాంటి నిధులు ఖర్చు పెట్టలేదు. బాపట్ల, గురజాల నియోజకవర్గాల్లో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కాలేజీల పనులు ముందుకు సాగాలంటే ఈ బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు జరగాల్సి ఉన్నది. అమరావతి - అనంతపురం గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుని కూడా బుట్ట దాఖలు చేసింది.



గుంటూరు ఛానల్



పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల




నిజాంపట్నం హార్బర్



గోదావరి జలాల తరలింపు పథకంకు నకరికల్లు వద్ద నాటి సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

చిత్తశుద్ధి కరువు

పల్నాడు జిల్లాలోని నీటి పథకాలపై ప్రభుత్వం మొండిచెయి చూపింది. నీటి పథకాలను పూర్తి చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బుగ్గన బడ్జెట్ తెలియజేసింది. పల్నాడు జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుండగా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు లేవు. దీంతో తొలి బడ్జెట్‌లాగే ఈ ఏడూ జిల్లా వాసులకు నిరాశనే మిగిల్చింది. తాగు, సాగునీటి పథకాలకు నిధుల కేటాయింపులు లేదు. వాటర్ గ్రిడ్‌పై, దశాబ్దాల కలైన వరికపూడిశెలకు బడ్జెట్‌లో నిధులు లేవు. పల్నాడు కరువు పథకం పనుల ఊసే ఎత్తలేదు. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం గురించి ఆలోచించలేదు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ పథకంగా పేరు మార్చిన ప్రభుత్వం నిధుల విడుదలను విస్మరించింది. వరికపూడిశెల ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నదని ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతుందని రైతులు మండిపడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా సీఎం శంకుస్థాపన చేసి నిధులు విడుదల చేయకుండా చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు రాకుండానే శంకుస్థాపన చేయడం ప్రజలను మోసం చేయడమేనని చెప్పవచ్చు. దాదాపు 21,473 ఎకరాలను సాగు నీరు అందించే తంగెడ, మాచవరం ఎత్తిపోతల పథకాలు సర్వే దశలో ఉన్నా బడ్జెట్‌లో నిధుల కేటాయింపును విస్మరించింది. ఇప్పట్లో ఈ పథకాల పనులు పట్టాలెక్కే పరిస్థితులు కానరావడంలేదు. జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రకటించిన వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం విస్మరించిందన్న విమర్శలున్నాయి. రూ.1200 వ్యయం అవుతుందని అంచనా వేసి, 611 గ్రామాలకు నీరు అందించే ఈ బృహత్తర పథకం నిర్మాణంపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. నిధులు లేకపోవడంతో రెండేళ్లుగా ఈ పథకం పను లు ప్రారంభం కాలేదు. ఈ బడ్జెట్‌లోనూ నిధులను విస్మరిం చడంతో ఈ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. తాగు, సాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాల్వ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు నిధుల విడుదల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుందన్న విమర్శలున్నాయి. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే గురజాల, మాచర్ల నియోజకవర్గాల ప్రజలకు వేసవిలో తాగునీటి కష్టాలు తప్పే అవకాశం ఉన్నా ప్రభుత్వంలో చలనంలేదు. జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై ఆధారపడి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై జిల్లావాసులు తీవ్ర అసం తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన సాగు, తాగునీటి పథకాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవ డిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. .



ఎత్తిపోతల

ఓదారుస్తూ.. భరోసా

నిజం గెలవాలి యాత్రలో భువనేశ్వరి

- బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం
- టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఘనస్వాగతం



వట్టిచెరుకూరు : అనంతవర్పాడు ఎస్సీ కాలనీలో కోటేశ్వరరావు భార్యకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

వట్టిచెరుకూరు, నరసరావుపేట రూరల్, రొంపిచర్ల, యడ్లపాడు, ఫిబ్రవరి 7: ఓదారుస్తూ.. పరామర్శిస్తూ.. యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ.. ధైర్యంగా ఉండాలి.. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ.. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర చేపట్టారు. బుధవారం పల్నాడు, గుంటూరు జిల్లాలో ఆమె పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో కలత చెంది గతంలో మృతి చెందిన కుటుంబాలను ఈ పర్యటనలో భువనేశ్వరి ప్రత్యేకంగా పరామర్శించారు. ఆయా కుటుంబాల వారికి ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో నార్నె విజయలక్ష్మి, అనంతవరప్పాడు ఎస్సీకాలనీలో కోటేశ్వరరావు, యడ్లపాడు ఎస్టీకాలనీలో మరణించిన మొగిలి సత్యనారాయణ కుటుంబాల్ని పరామర్శించారు. అనంతరం నరసరావుపేట మండలం ములకలూరులోని షేక్ సైదా, పాలపాడులోని కొలికొండ ఆంజనేయులు, రొంపిచర్ల మండలం అన్నవరంలో ఉదయ్‌శేఖర్, చిన్న భిక్షాలు కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కులు అందజేశారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు.



పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వాగతం

భువనేశ్వరి పర్యటనలో టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు హారతు లు పట్టి ఆమెకు స్వాగతం పలికారు. యడ్లపాడు, చిలకలూరిపేట, కావూరు, అవిశాయపాలెం, ములకలూరు, నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు, కాకతీయనగర్, రావిపాడు, పాలపాడులలో మహిళలు, టీడీపీ శ్రేణులు భువనేశ్వరికి స్వాగతం పలికారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి ప్రత్తి పాటి పుల్లారావు, ప్రత్తిపాటి వెంకటకుమారి, నరసరావుపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ నేతృత్వంలో భువనేశ్వరికి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ అనురాధ, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ములకలూరులో చెక్కును అందజేసి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

- వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు, వింజనంపాడు గ్రామాల్లో భువనేశ్వరికి అడుగడుగున మహిళలు టీడీపీ, జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్ర హాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ప్రత్తిపాడు సమన్వ యకర్త రామాంజనేయులు, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ జడ్పీటీసీ అన్నాబత్తుని జయలక్ష్మి, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, అనంతవరప్పాడు గ్రామ అధ్యక్షుడు మోపర్తి శంకర్, సర్పంచ్ దారా వెంకట్రావు, జనసేన మండల అధ్యక్షులు పత్తి భావన్నారాయణ, కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాగిశెట్టి నాగరాజు, జనసేన సమన్వయకర్త క్రొప్రాపాటి నాగేశ్వరరావు, ప్రవీణ్, మాజీ సర్పంచ్ ముప్పా మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు యర్రగుంట్ల నరేంద్రబాబు, వింజనంపాడు సర్పంచ్ నార్నె రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పుటూరి సుజాత, మాజీ సర్పంచ్ చింపిరయ్య, మాజీ ఎంపీటీసీ నార్నె సాంబశివరావు, పరిటాల హరిబాబు పాల్గొన్నారు.

నేతలకు ఇసుకపైనే ప్రేమ

- కట్టలను కూల్చేసి అక్రమార్జన
- వైఎస్ చేసిన అభివృద్ధి తప్ప ఇంకేమీ లేదు
- రాజశేఖరరెడ్డి విగ్రహం పెట్టడాన్ని అడ్డుకున్న నేత
- బాపట్ల బహిరంగ సభలో పీసీసీ సారథి షర్మిల

బాపట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నేను దారిలో వస్తుండగా ఓ అన్నను బాపట్ల ఎలా ఉందని అడిగా.. మీ నాన్న ఉన్నప్పుడు 1400 కోట్లతో చేసిన పనులు తప్ప మరేమీ లేదన్నారు. కనీసం రోడ్లు కూడా వేయలేదన్నాడు. ఇక్కడున్న ఎమ్మెల్యే, ఎంపీలకు ఇసుక మాఫియా మీద ప్రేమ తప్ప మరేం లేదు. కట్టలు కట్టడం కాదు కదా వాటిని కూడా కూల్చేసి ఆ ఇసుకను కూడా అక్రమార్జనకు వాడుకుంటున్నారు. రాజశేఖరరెడ్డి విగ్రహం కూడా పెట్టకుండా ఇక్కడున్న వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. వీళ్లా ఆయన ఆశయాలను నెరవేర్చేది..' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి అన్నారు. బుధవారం బాపట్లలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తయితే రెండు పంటలకు నీళ్లు అందుతాయని తెలిసీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాజశేఖ రరెడ్డి వ్యవసాయాన్ని పండగ చేస్తే పంట నష్ట పరిహారం కూడా ఇవ్వని ప్రభుత్వం జగన్‌దని షర్మిల అన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కనీసం బాపట్ల తాగునీటి సమస్యను కూడా పట్టించుకో లేదన్నారు. ఒక్క సీటు కూడా గెలవని బీజేపీకి రాష్ట్రంలోని రెండు పార్టీలు గులాంగిరి చేస్తున్నాయన్నారు. దళిత క్రైస్తవులకు దళితుల హోదా దక్కాలంటే పీసీసీ సారథి షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. గతంలో రామానాయుడు మీద పోటీ చేసి కొద్ది తేడాతో ఓడిపోయానని కాంగ్రెస్ మళ్లీ ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాజశేఖరరెడ్డి దిష్టిబొమ్మలు తగలబెట్టిన వ్యక్తిని వైసీపీలోకి తీసుకుని పదవులు కట్టబెట్టారని స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు తెలిపారు.



మాట్లాడుతున్న షర్మిల

రోడ్ షో విజయవంతం..

బాపట్ల చీలురోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు జరిగిన షర్మిల రోడ్‌షోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాయి. రోడ్డు పొడ వునా ఉన్న జనానికి అభివాదం చేస్తూ షర్మిల ముందుకు కదిలారు. బహి రంగ సభ అనంతరం ఆమె రాత్రి బస కోసం బాపట్ల ఇంజనీరింగ్ కళాశా లకు వెళ్లారు. బుధవారం రాత్రికి అక్కడే బస చేయనున్న ఆమె గురువారం తెనాలి మండలంలో జరిగే రచ్చబండ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కెవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, కనుమూరి బాపిరాజు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు



సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

జై శ్రీరామ్

- గుంటూరు నుంచి అయోధ్యకు రైలు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని భవ్యమైన రామ మందిరం- దివ్యమైన బాలరాముని దర్శనార్థం రామ భక్తులతో కూడిన అయోధ్య ప్రత్యేక రైలు గుంటూరు నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా గుంటూరు రైల్వేస్టేషన్ ప్రాంగణం జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది. రామ భక్తులతో స్టేషన్ కిక్కిరిపోసింది. శ్రీరామభక్తులకు నుదుటిన తిలకం అద్ది బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ పలు బోగీలలోకి వెళ్లి ప్రయాణికులతో మాట్లాడారు. క్షేమంగా అయోధ్యదాం పర్యటన ముగించుకుని రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ప్రత్యేక రైలు లోకోకి పూజలు చేసి వారు పోశారు. ఆ తర్వాత పురందేశ్వరి పచ్చ జెండా ఊపి రైలుకు సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఏపీ నుంచి అయోధ్యకు వెళుతున్న మొదటి రైలన్నారు. భక్తులు తండోపతండాలుగా బాలరాముని దర్శనం కోసం వెళుతుంటే చూడాలని మాత్రమే తాను వచ్చానన్నారు. కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు పాల్గొన్నారు.



రైలుకి జెండా ఊపి ప్రారంభిస్తున్న పురంధేశ్వరి

డయేరియా.. ఒకరి మృతి? గుంటూరులో తాగునీరు కలుషితం 7లో..

టిప్పర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: ద్విచక్రవాహనాన్ని ప్రమాదవశాత్తు టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పిట్టంబండ గ్రామసమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉమ్మడివరం గ్రామ ఎస్సీ కాలనీ చెందిన పిడతల చంద్రశేఖర్ (18) వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లి పున్నమ్మతో కలిసి వినుకొండ వద్ద ఓ శుభకార్యానికి హాజరైన అనంతరం మసీదుమాన్యంలోని తన సోదరి ఇంటి వద్దకు వెళ్లారు. అనంతరం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పిట్టంబండ సమీపంలో వెనుకగా వస్తున్న కంకరు టిప్పర్ తగలడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న పున్నమ్మతో పాటు చంద్రశేఖర్ కిందపడ్డారు. చంద్రశేఖర్‌కు టిప్పర్ టైరు తగలడంతో తీవ్రగాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి విద్యార్థి మృతి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: పురుగుమందు తాగి విద్యార్థి మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామానికి చెందిన అమృతపూడి నాగరాజు వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 5వ తేదీన నాగరాజు గడ్డి మందు తాగాడు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



రంగు పడింది..

సత్తెనపల్లి, ఫిబ్రవరి 7: సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాలకు అధికార పార్టీ రంగులు వేయటం చర్చనీయాంశంగా ఉంది. 2018లో స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో ఈ భవనాన్ని నిర్మించారు. దానిపై అదనపు భవన నిర్మాణ పనులు కూడా 90శాతం పూర్తయ్యాయి. ఇప్పుడు భవనానికి రంగులు వేసి ఉండటం చూసి వైద్యశాలకు వచ్చిన రోగులతో పాటు పట్టణ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నిండు ప్రాణం.. సమాధి

పైపు లీకులు మరమ్మతులో అపశ్రుతి ● విధులు నిర్వర్తిస్తూ మునిసిపల్ కార్మికుడు మృతి ● తెనాలిలో విషాదం



ఎక్స్‌కవేటర్‌తో వెంకటేశ్వర్లుపై పడిన భారీ మట్టిని తొలగిస్తున్న అధికారులు, మట్టిలో కూరుకుపోయిన వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు (ఫైల్ ఫొటో)

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7: మంచినీటి పైపులైను మరమ్మత్తుకు తీసిన గుంత ఓ నిండుప్రాణాన్ని బలిగొంది. వివరాల్లోకి వెళితే.. తెనాలి పట్టణంలోని మునిసిపాలిటీ పరిధిలో బుధవారం మంచినీటి పైపులైను లీకుల మరమ్మత్తులు చేపట్టారు. ఐతానగర్ రజక చెరువురోడ్డులో ప్రధాన రహదారి వెంట జేసీబీ సహాయంతో దాదాపుగా 5 అడుగు గుంత తవ్వగా పైపులైన్ లీకు అవుతూ కనిపించింది. మునిసిపల్ టెంపరరీ పారిశుధ్య కార్మికుడైన ఇమల్ల వెంకటేశ్వర్లు(50) గుంతలో దిగి పైపు చుట్టూ ఉన్న మట్టిని తీసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇదే క్రమంలో జేసీబీతో తవ్వి గుంత అంచున వేసిన మట్టి ముద్ద జారి పనిచేస్తున్న వెంకటేశ్వర్లుపై పడింది. ఆ మట్టిలో పూర్తిగా కూరుకుపోయిన వెంకటేశ్వర్లు బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. తోటి కార్మికులు మట్టి తొలగించి కాపాడే ప్రయత్నం చేయగా.. మట్టి ముద్దగా ఉండటంతో దానిని తీయడం కష్టమైంది. దాదాపుగా 20 నిముషాలు పైనే సమయం పట్టేసరికి వెంకటేశ్వర్లు గుంతలోనే ప్రాణాలు విడిచాడు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు చుండూరు మండలం చినపరిమి గ్రామవాసి. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న భార్య మరియమ్మ, కుమారులు మధుబాబు, సుద్దబాబు, ఇతర కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని విగతజీవుడిగా ఉన్న వెంకటేశ్వర్లును చూసి గుండెలు పగిలేలా రోదించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న ఇతర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతుని కుటుంబసభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంచినీటి పైపులైన్లు మరమ్మత్తులు చేసే క్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాల్సి ఉంది. వారెవరూ లేకుండా పనులు పురమాయించి అక్కడి నుంచి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు జరిగే సమయంలో ఇంజనీరింగ్ సిబ్బంది అక్కడే ఉన్నారని ఇది అనుకోకుండా జరిగిన ఘటన మాత్రమేనని కమిషనర్ శేషన్న చెప్పారు.

డయేరియా.. ఒకరి మృతి?

- గుంటూరులో తాగునీరు కలుషితం
- పైపులైన్లకు మరమ్మతులు.. తాగునీరు సరఫరా
- వాంతులు, విరేచనాలతో జీజీహెచ్‌కి చేరిన బాధితులు
- ప్రైవేటు, స్థానిక వైద్యుల వద్ద కూడా పలువురి చికిత్సలు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7: గుంటూరులో కలుషితమైన తాగునీటికి ఒకరు బలయ్యారు. వాంతులు, విరేచనాలతో పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పైపులైన్లు లీకులతో మురుగునీరు కలిసి గతంలో నగరంలో తాగునీరు కలుషితమైంది. అప్పట్లో ఆ నీటి కారణంగా పలువురు మృతి చెందగా పెద్దసంఖ్యలో ఆస్పత్రులు పాలైన విషయం తెలిసిందే. ఇదే రీతిలో బీఆర్ స్టేడియం నుంచి సంగడిగుంట ప్రాంతంలోని తిరుమలాచారి కాలనీలోకి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైంది. ఇటీవల బీఆర్ స్టేడియం బయట పైపులైన్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆ ప్రాంతం వారికి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైంది. దీంతో సూర్యదేవర ఎస్టేట్ సమీపంలోని తిరుమలాచారి కాలనీకి చెందిన కొర్రపాటి ఓబులు, ఆయన భార్య జయమ్మ, కొడుకు కుమార్, అల్లుడు కృష్ణలు వాంతులు, విరేచనాలతో అవస్వస్థతకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి కొర్రపాటి ఓబులు(50) మృతి చెందాడు. అల్లుడు కృష్ణని మెరుగైన వైద్యం కోసం కాకానిరోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పొన్నూరు రోడ్డులోని అహ్మద్‌నగర్‌కు చెందిన జీవా అనే మరో వ్యక్తి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తిరుమలాచారి కాలనీకి చెందిన మరో పది కుటుంబాల వారు బుధవారం రాత్రి వాంతులు, విరేచనాలకు గురై స్థానికంగా ఉన్న వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు.



ఓబులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నసీర్

మున్సిపల్ ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లే ..

బీఆర్ స్టేడియంలో పని చేస్తున్న మున్సిపల్ ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లే తిరుమలాచారి కాలనీ, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు కలుషితమై డయేరియా తరహాలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ తెలిపారు. ఇప్పటికే ఒకరు మృతి చెందారని, కలుషిత నీరు సరఫరా వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. బుధవారం రాత్రి బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన వారికి కావాల్సిన వైద్య సదుపాయాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించాలన్నారు.

కన్నతల్లే కడతేర్చింది..

● యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ

గుంటూరు, ఫిబ్రవరి 7: స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకలవాగు కట్టమీద మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురైన షేక్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ నరేష్, వెనుక నిందితులు

మహబూబ్ సుభాని హత్య కేసులో మిస్టరీ వీడింది. తొలుత ఈ హత్య ఆటోడ్రైవర్ షేక్ చిన బాజీ చేసినట్లు భావించారు. అయితే పోలీసుల విచారణలో ఈ హత్యలో చినబాజీతో పాటు హతుడి తల్లి జరీనాబేగం హస్తం కూడా ఉన్నట్లు తేలింది. దీంతో గంటల వ్యవధిలోనే ఇరువురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. బుధవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ డి.నరేష్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

పీకలవాగుకట్ట ప్రాంతానికి చెందిన జరీనాబేగం కుమారుడు సుభాని ఆటో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా జరీనాబేగం ఆటోడ్రైవర్ చినబాజీతో సహజీవనం సాగిస్తోంది. అయితే ఇది సుభానీకి ఇష్టం లేదు. అంతేగాక తాను సంపాదించిన సొమ్మును తల్లి బాజీకి పెడుతుందని బావించి తరచూ బాజీతో గొడవ పడుతుండేవాడు. అయితే తమ సంబంధానికి కొడుకు అడ్డుగా ఉన్నాడని భావించిన తల్లి జరీనాబేగం తన ప్రియుడితో కలసి కన్న కుమారుడి హత్యకు పథకం రూపొందించింది. ముగ్గురూ కలసి మద్యం సేవిస్తుండగా వారి మధ్య గొడవ జరిగింది. దీంతో తల్లి, ప్రియుడు కలసి రోకలిబండతో సుభానీని కొట్టి చంపారు. ఇరువురు నిందితులను అరెస్ట్ చేసిన నగరంపాలెం సీఐ నరేష్, సిబ్బందిని వెస్ట్ డీఎస్పీ అభినందించారు.



ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీకి ఓటేసి కష్టాలపాలయ్యాం..

● ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చినపరిమి కార్యకర్తలు

చుండూరు, ఫిబ్రవరి 7: పొరపడ్డాం.. అసమర్థుడికి ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నాం.. ఇక నుంచి మీ వెంటే మా పయనం అంటూ చినపరిమి దళితవాడకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరులోని ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో చినపరిమికి చెందిన 20 కుటుంబాలు ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ కల్లబొల్లి వాగ్దానాలు చేసి ఆశలు రేపి గెలిచిన జగన్ చివరికి ప్రజలను రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచాడన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి రాష్ట్రాన్ని ఈ సైకో పాలన గురించి విముక్తి కలిగించడానికి ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని తెలిపారు. ఈ సందర్భంగా చినపరిమి గ్రామంలో గత ప్రభుత్వంలో రూ.5 కోట్లతో జరిగిన అభివృద్ధి పనుల గురించి గ్రామస్తులు ఆనందబాబుకు గుర్తు చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ చిరంజీవి, రేవంత్, కళ్యాణ్, చొప్పర ఇశ్రాయిల్, జాన్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, ఫిబ్రవరి 7: నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు బుధవారం ఢిల్లీలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును కలిశారు. టీడీపీలో తన చేరికపై చంద్రబాబుతో లావు చర్చించినట్టు తెలిసింది. 11వ తేదీ తర్వాత పార్టీలో చేరే అంశంపై చంద్రబాబుతో చర్చించగా ఇందుకు ఆయన అంగీకరించారని చెబుతున్నారు. ఇప్పటికే నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా శ్రీకృష్ణదేవారాయలు పేరును టీడీపీ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఇరువురు మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం. మొత్తం మీద చంద్రబాబుతో భేటీతో లావు టీడీపీలో చేరికకు ముహూర్తం ఖరారైనట్టు తెలిసింది. వారంలోగా లావు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. లావు బాటలోనే మాజీ ఎమ్మెల్యే మక్కెనవైసీపీని వీడారు. జంగా వైసీపీకి రాజీనామా చేసే అంశం నేడు పిడుగురాళ్లలో ఆయన నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేంలో తేలనుంది. ఇటీవల లావు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

యువకుడి హత్య కేసులో వీడని మిస్టరీ

● పోలీసులపై పరస్పర ఆరోపణలు

బాపట్ల, ఫిబ్రవరి 7: బాపట్లలో కలకలం రేపిన యువకుడి హత్య కేసులో మిస్టరీ వీడలేదు. హత్యకు గల కారణాలు పోలీసులకు అంతుబట్టలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం, గంజాయి మత్తులో సినీఫక్కీలో జరిగిన ఈ ఘటన బాపట్ల పరిసర ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది. మంగళవారం చీలురోడ్డుసెంటర్‌లో షేక్ యాసిన్ అనేయువకుడిపై కొంతమంది యువకులు దాడిచేసినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోనూ అనే యువకుడు మరికొంతమందితో కలిసి వచ్చి తనను మీ అంతా చూస్తామని బెదిరించి దాడిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించకపోవటంతో యువకుడి హత్యకు దారితీసిందని మృతుడి కుటుంబసభ్యులతోపాటు బాధిత కుటుంబాలవారు ఆరోపిస్తున్నారు. యాసిన్ ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు సోనూ స్నేహితుడు రాహుల్ బంధువులకు ఫోన్ చేసి ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో రెచ్చిపోయిన సోనూ, రాహుల్‌లు తమ స్నేహితులతో కలిసి యాసిన్‌కు ఫోన్ చేసి మరలా బెదిరించి ఎక్కడ ఉన్నారో కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే యాసిన్ స్నేహితుడు నిత్యం రద్దీగా ఉండే సూర్యలంకరోడ్డులోని రెస్టారెంట్ వద్ద ఉన్న వారిపై దాడి చేసి గోరంట్ల సుమంత్‌ను హత్య చేసినట్లు తెలుస్తున్నది. ఈ దాడిలో సుమంత్‌తోపాటు, రాహుల్ కూడా తీవ్రంగా గాయపడి చీరాలలో చికిత్స పొంది వెళ్లిపోయినట్లు తెలిసింది. గతంలో యాసిన్‌కు, సోనూకు మధ్య గొడవలు ఉన్నట్లు సమాచారం. సంచలనం రేపిన ఈ సంఘటనలో పోలీసులు సరిగ్గా స్పందించకపోవటం వల్లే దాడి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సాయంత్రం 7గంటలకు ఫిర్యాదు చేశారు : సీఐ

యాసిన్ అనే యువకుడు తనపై కొంతమంది దాడి చేసి బెదిరించారని సాయంత్రం 7గంటలకు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. దీనికి కారకులైన వారిని పిలిపించి విచారిస్తామని చెప్పగా యాసిన్‌ను తన యాజమాన్యంకు సమాచారం ఇచ్చి వస్తానని బయటకెళ్ళిన అరగంట తర్వాత హత్య జరిగినట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడకు వెళ్ళి చూడగా సుమంత్‌ను హత్య చేసినట్లు గుర్తించటంతోపాటు అక్కడ రాహుల్‌కు సంబంధించిన రెండు కార్లు ఉండగా అందులో ఒకటి ధ్వంసం చేసి ఉన్నట్లు గుర్తించామన్నారు. కేసును రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. హత్యకు గురైన గోరంట్ల సుమంత్ భౌతికకాయాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. రూరల్ సీఐ జి.హజరత్‌బాబు ఆధ్వర్యంలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనకు కారకులైన వారిలో ఇరువురిని విచారిస్తున్నట్లు సమాచారం.

గురజాలలో సర్వేలన్నీ టీడీపీ వైపే

● యరపతినేనితో చెప్పిన చంద్రబాబు



చంద్రబాబుతో యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7: గురజాల సీటు ఈసారి తప్పకుండా మంచి మెజారిటీతో గెలుస్తాం.. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలుంటే సరిచూసుకో.. శ్రీనివాస్ అని టీడీపీ అధినేత చంద్రబాబు గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలకు టీడీపీ సమాయత్తమవుతున్న నేపథ్యంలో జిల్లాల వారీగా దాదాపు టిక్కెట్ ఖాయమై పోటీచేసే అభ్యర్థులతో చంద్రబాబు ముఖాముఖిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాలకు పైగా వారిద్దరి మధ్య వివిధ అంశాలపై చర్చ జరిగింది. వివిధ సంస్థలు నిర్వహించిన పలు సర్వేలన్నింటిలోను గురజాలలో టీడీపీ వైపే చూపుతున్నాయని చంద్రబాబు యరపతినేనితో అన్నారు. గురజాలలో సైకిల్ స్పీడ్ పెరిగిందని, రేపటి ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే విధంగా అన్ని సర్వేలు సూచిస్తున్నాయి. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలున్నా వాటిని జాగ్రత్తగా చూసుకుంటూ ముందుకెళ్లాలి శ్రీనివాస్.. అంటూ చంద్రబాబు యరపతినేని భుజం తట్టారు. ఉమ్మడి జిల్లా, పల్నాడు జిల్లాలోనూ గురజాలతో పాటు అన్ని నియోజకవర్గాలు కూడా కచ్చితంగా గెలుస్తామని చంద్రబాబు తెలిపారు. గురజాలలో మంచి మెజారిటీతో గెలిచి రావాలని చంద్రబాబు సూచించారు. 1994లో ఎన్‌టీఆర్ మొదటిసారిగా ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వగా అప్పటి నుంచి వరుసగా గురజాల నుంచి పోటీ చేస్తున్నానని, మీరిచ్చిన స్ఫూర్తితోనే గురజాలలో పనిచేస్తున్నానని, ఇప్పుడు కూడా 7వసారి గురజాల నుంచి పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ నాయకుల అక్రమాలకు 8 మంది చిన్నారులు చనిపోయినా, 11 మంది హత్యకు గురైనా ఎక్కడా తొణక్కుండా వారందరికీ నేనున్నాననే ధీమా, నీలో వున్న ధైర్యమే కార్యకర్తలందరూ నీవెంట నడిచేలా చేస్తుందన్నారు. పల్నాడులో ఫ్యాక్షన్‌ను రూపుమాపి అభివృద్ధే ధ్యేయమన్న నీ ఆలోచన గొప్పది.. అదే నీ గెలుపుకు బాట వేస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.



తుళ్ళూరు శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం

● 1513వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పెద్దల దోపిడీ ఆగటం లేదని, మూడు ముక్కల ఆటతో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1513వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు వారు మాట్లాడుతూ పరిపాలనకు పనికిరాని వారిని సలహాదారులుగా పెట్టుకొని, నెలకే కొన్ని కోట్ల రూపాయల ప్రజాధనం తగలేస్తున్నారన్నారు. ప్రజా రాజధాని అమరావతిలో మాత్రం అంగుళం నిర్మాణాన్ని సీఎం జగన్‌రెడ్డి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పాలన అమరావతి నుండే చేస్తున్నారని, అదే అమరావతి మీద విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వీర్యం చేయటానికి కుట్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయకుండా నాన్చుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం.. ఆ ప్రజలనే మూడు ముక్కల ఆటతో వెన్నుపోటు పొడిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానులకు స్వస్తి పలికి, రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినానాదాలు చేశారు. మంద డం, తుళ్లూరు, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, వెలగపూడి తదితర రాజధాని గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న జయదేవ్, కనకమేడల, రామ్మోహన్‌నాయుడు

అందరివాడు వెంకయ్యనాయుడు

● మాజీ ఉప రాష్ట్రపతిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ ఎంపీలు

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో సైద్ధాంతిక విభేదాలే తప్ప వ్యక్తిగత విభేదాలుండవని నమ్మే వెంకయ్యనాయుడు అన్ని పార్టీల నేతలకు మంచి మిత్రుడని, అందరివాడని టీడీపీ పార్లమెంటరీ నేత గల్లా జయదేవ్ అన్నారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్ రామ్మోహన్‌నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్ బుధవారం ఆయన నివాసంలో కలసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడుతూ దేశరాజకీయాల్లో వెంకయ్యనాయుడు సుదీర్ఘకాలం పాటు సేవలందించారని, ఇందుకుగాను ఆయనకు పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించడం సంతోషించదగిన విషయ మన్నారు. విద్యార్థిదశ నుంచి రాజకీయాల్లో క్రియా శీలంగా ఉంటూ దృఢ సంకల్పం, తిరుగులేని క్రమశిక్షణతో ఉపరాష్ట్రపతి పదవివరకు ఎదిగారన్నారు. ఉపరాష్ట్రపతిగా పదవీకాలం ముగిసిన తర్వాత కూడా వెంకయ్యనాయుడు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం ముప్పై ఏళ్లు వెనక్కు

ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి7: వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి రెండు నెలలు పనిచెయ్యాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం ఉప్పూడి రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తెచ్చి ప్రజలను ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని సమర్థవంతమైన నాయకత్వం లేకపోవటంతో ఏపీని చూసి ఇతర రాష్ట్రాలవారంతా చిన్నతనంగా మాట్లాడుతున్నారన్నారు. రెండు నెలల పాటు కార్యకర్తలు, నాయకులు, కష్టపడి పార్టీ గెలుపుకోసం కృషి చెయ్యాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మురళీధరరావు, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు, చింతల సుబ్బారావు, వెంకట్‌యాదవ్, మల్లాది రామకృష్ణ, నిజాంపట్నం జడ్పీటీసీ సుబ్బయ్య, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, జీవీ నాగేశ్వరరావు, వీరయ్య, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మేకా వెంకట శివరామకృష్ణ, కేసన రామకృష్ణ పాల్గొన్నారు.

1,26,797 మిర్చి టిక్కీలు విక్రయం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,30,662 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,26,797 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 87,688 మిర్చి టిక్కీలు నిల్వఉన్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రజలకు చంద్ర బాబు హామీ పత్రాలు అందజేస్తున్న నసీర్

యువతను చైతన్యపరిచి బాబును గెలిపిస్తాం

● టీడీపీ తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'మైఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమంతో యువతలో చైతన్యం తెచ్చి, చంద్రబాబుకు తొలి ఓటు వేయించి గెలిపించుకుంటామని టీడీపీ తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. స్థానిక ఇజ్రాయెల్‌పేటలో బుధవారం ఆయన 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవడంలో సైకోరెడ్డి ఇంటికి పంపడానికి ఈసారి యువత కీలకపాత్ర పోషించబోతుందన్నారు. యువ ఓటర్లను కలిసి చైతన్య నింపి వారి ఓటును టీడీపీకి వేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జబిఖాన్, అన్వర్, రత్తయ్య, వెంకటేశ్వర్లు, రాజేష్, భాషి, కోటి, నాగూర్‌మీరా, బాబు, శివ, ఖాదర్, మహేష్, భవాని తదితరులు పాల్గొన్నారు

మార్పుకోసం యువ చైతన్యం ఎంతో అవసరం ..

సమాజ మార్పుకోసం యువతలో చైతన్యం ఎంతో అవసరమని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. పార్టీ తూర్పు కార్యాలయంలో బుధవారం ఆయన 'మై ఫస్ట్ ఓట్ టూ సీబీఎన్' కార్యక్రమం గురించి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో తొలిసారిగా ఓటుహక్కు పొందిన విద్యార్థి, యువతరాన్ని చైతన్యపరిచి వారి తొలి ఓటు చంద్రబాబుకు వేసేలా చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణకు గుడిపల్లి వాణి, నాయుడు మధు, సూఫియా, నవీన్‌లను ఎంపిక చేశారు.

బడ్జెట్ కాదు.. ఆత్మస్తుతి పరనిందల ప్రసంగం


● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు చేసింది బడ్జెట్ ప్రసంగం కాదని, ఆత్మస్తుతి, పరనిందల ప్రసంగమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో బధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ఏ బడ్జెట్ చూసినా అవాస్తవాలు, అంకెల గారడీ, అభూత కల్పనల మేళవింపు తప్ప మరొకటి ఉండదని మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.4.25లక్షల కోట్ల నగదు బదిలీతో పేదరికం తొలగించామని, రాష్ట్రం రూ.12లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోతే బడ్జెట్‌లో అప్పులు తమ హయాంలోనే తక్కువ చేసినట్లు చెప్పుకోవడం వింతగా ఉందన్నారు. విభజన సమస్యలు పరిష్కరించామని చెబుతున్న ఆర్థిక మంత్రి ప్రత్యేకహోదా, రైల్వేజోన్ భూ కేటాయింపులు, పోలవరం ప్రాజెక్టునిధులు, కడప స్టీల్ ప్లాంట్, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ వంటివి సాధించినట్లు ప్రకటించుకోవడం సిగ్గుచేటున్నారు. జగన్‌రెడ్డి చెబుతున్నట్లు రాష్ట్రంలో పేదరికం తగ్గితే ఐదేళ్లలో ఉపాధి లేక 21 వేల మంది యువకులు, 4 వేల మంది రైతులు, రైతు కూలీలు, 200 మంది భవన నిర్మాణ కార్మికులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారని నిలదీశారు. మంత్రి బుగ్గన వాస్తవాలు దాచి గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని మన్నవ హితవు పలికారు.

ఓటాన్ అకౌంట్ కాదు.. వైసీపీ ప్రచార బడ్జెట్

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కాదని వైసీపీ ఎన్నికల ప్రచార బడ్జెట్ అని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ధ్వజమెత్తారు. పార్టీనగర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్ సెషన్‌ను వైసీపీ ఎన్నికల ప్రచార పర్వంలా మార్చేశారని మండిపడ్డారు. అప్పులు చేసి డబ్బులు పంచితే, అది పేదరిక నిర్మూలన ఎలా అవుతుందని నిలదీశారు. 43 లక్షల మంది విద్యార్థులకు గోరు ముద్ద, 35 లక్షల మంది పిల్లలకు సంపూర్ణ పోషణ అని లెక్కలు చెప్పారని, అందులో వాస్తవమెంత? అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు హడావుడిగా టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి డ్రామాలాడుతున్నారన్నారు. టీడీపీ పాలనతోనే ప్రజల జీవితాలు మారుతాయన్నారు. జగన్‌రెడ్డి రెడ్డి మళ్లీ కల్లబొల్లి మాటలతో ప్రజల ముందుకు వస్తున్నారని ప్రజలు అప్రమత్తతో ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

ఏపీసీసీ అధికార ప్రతినిధిగా రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 7: ఏపీసీసీ అధికార ప్రతినిధిగా బ్రాడీపేటకు చెందిన డబ్బుకొట్టు రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ మీడియా చైర్మన్ ఎన్.తులసీరెడ్డి ప్రకటించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆకాంక్షించారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ పార్టీనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలను అమలు చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయే నన్నారు. తన నియామకంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

రాష్ట్ర భవిష్యత్తు మార్చేందుకు తొలి ఓటు వేయాలి

● తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తొలిసారిగా ఓటు పొందిన విద్యార్థి, యువకులు తమ విలువైన ఓటును రాష్ట్ర భవిష్యత్తును మార్చేందుకు వినియోగించాలని, చంద్రబాబును గెలిపించాలని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్‌నేతలు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో 'మై ఫస్ట్ ఓట్ టూ సీబీఎన్' కార్యక్రమ పోస్టర్లను 'ఏపీ లీడర్స్ వారియర్స్' పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రావిపాటి సాయికృష్ణ, పోపూరి నరేంద్ర, ధర్మతేజ, తులసి మౌలిక మాట్లాడారు. శ్రీనివాసరావు, ఇమ్రాన్, అనిల్, సాంబశివరావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



చర్చలో పాల్గొన్న రహదారి భద్రత అధికారులు, అధ్యాపకులు

ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలి

గుంటూరు(తూరు), ఫిబ్రవరి7: రోజురోజుకి ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతుందని, దీనిపై పరిష్కార మార్గాలు వెతకాల్సిన అవసరం ముందని రహదారి భద్రత అధికారులు, స్వచ్ఛంద సేవసంస్థల నిర్వాహకులు అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా బుధవారం డీటీసీ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణపై జాతీయ, రాష్ట్ర హైవేస్, ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులతో కలసి చర్చా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తరగతులు పూర్తయిన తర్వాత ఒక్కసారిగా 2 వేల మంది ఎంబీటీఎస్ నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రోడ్డుపైకి వస్తున్నారని, దీంతో ట్రాఫిక్ ఏర్పడుతుందని వివరించారు. అలాగే శ్యామలానగర్ రైల్వే క్రాసింగ్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడుతుందని దీనిపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ వివిధ విభాగాలను సమన్వయం చేసుకుని ట్రాఫిక్‌సమస్యను పరిష్కారిస్తామన్నారు. సమావేశంలో రీజనల్ సంయుక్త రవాణా కమీషనర్ బీ.కృష్ణావేణీ, ఆర్‌అండ్‌బీ ఈఈ నాగిరెడ్డి, సుందరరామిరెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ అమరావతి సైట్ ఇంజనీరింగ్ నవీన్ ప్రసాదు, ట్రాఫిక్ ఎస్ఐ నారాయణరెడ్డి, వీవీఐటీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు సురేష్, ఆర్.శాంతి కళ, రవాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో 'జయూభవ'

● పరీక్షల్లో విజయం కోసం 50 రోజుల ప్రణాళిక

● ప్రతిరోజు ప్రత్యేకంగా స్టడీ తరగతులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7: ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులు మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఇంటర్ బోర్డు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోంది. ఈఏడాది జనవరి నుంచి మార్చి 1వ తేదీ వరకు 'జయూభవ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణకు ఇంటర్ బోర్డు షెడ్యూల్ జారీ చేసింది. ఇందులో భాగంగా ప్రత్యేక స్టడీ అవర్స్‌తో పాటు, ఒత్తిడికి గురుకాకుండా పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు దాదాపు 164 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం 23,375 మంది, ఇంటర్ ద్వితీయ సంత్సరం 26,976 మంది చదువుతున్నారు. విద్యార్థులకు ఈ ఏడాది మార్చి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో ఇంటర్ బోర్డు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోంది.



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

ప్రత్యేకంగా స్టడీ అవర్స్ ..

ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్ర స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. సిలబస్ పూర్తయిన కళాశాలల్లోని విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి, ఆ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడ్ చేసి, చదువులో వెనుకబడి ఉన్నవారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం,సాయంత్రం స్టడీ అవర్స్‌తో పాటు రెగ్యులర్‌గా పాఠ్యాంశాలను పునః పరిశీలనచేసి ఎవైనా సందేహాలుంటే అధ్యాపకులు నివృత్తి చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టైమ్ టెబుల్‌ను ఇంటర్‌బోర్డు ప్రభుత్వ,ఎయిడెడ్ కాలేజీలకు కేటాయించినట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత వెల్లడించారు.

డీవార్మింగ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పిలుపు ● ప్రచార పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 7: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 9న 19 సంవత్సరాల వయస్సు లోపు వారందరికి అల్బెండజోల్ మాత్రలు వందశాతం మింగించే కార్యక్రమాన్ని(డీవార్మింగ్) విజయవంతంచేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి లైన్‌శాఖ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై ప్రచార పోస్టర్లను జేసీ రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తిచేకూరి, ఆర్డీవో పెద్ది రోజా, డీఎంహెచ్‌వో డాక్టర్ కె విజయలక్ష్మీ, ఆర్బీకేఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏ.శ్రావణబాబులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 9న అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్ , ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల్లోని 4,72,534 మందికి అల్బెండజోల్ మాత్రలు వంద శాతం తీసుకునేటట్లు చర్యలు తీసుకోవాలని వైద్య శాఖాధికారులను ఆదేశించారు. వంద శాతం లక్ష్యాలు సాధించాలని, దీని వల్ల పిల్లల్లో రక్తహీనతను నిర్మూలించవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారణకు చేపడుతున్న ఈ బృహత్తర కార్య క్రమాన్ని లైన్‌శాఖ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు.

కొత్తగా 29,184 క్లెయిమ్‌లు

● కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి

● రాజకీయ పార్టీల ప్రతనిధులతో ఎస్ఎస్ఆర్-2024పై సమీక్ష

గుంటూరు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎస్ఎస్ఆర్ 2024కు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తి చేసి జనవరి 22వ తేదీ ఓటర్ల తుది జాబితాను ప్రచురించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. జనవరి 23వ తేది నుంచి ఫిబ్రవరి 6వ తేది వరకు అందిన 29,184 క్లెయిమ్‌లను పరిశీలించి పరిష్కరించాల్సి వుందని చెప్పారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం మంగళవారం వరకు ఫారం -6 6,946, ఫారం -6ఏ 23, ఫారం -7 6,460, ఫారం-8 15,755 కలిపి మొత్తం 29,184 క్లెయిమ్‌లు అందాయన్నారు. కొత్తగా వచ్చిన ఈ క్లెయిమ్‌లను ఈఆర్‌ఓలు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఓటర్ల జాబితాపై వచ్చిన వ్యతిరేక వార్తలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటుకు ఇటీవల పరిశీలించడం జరిగిందన్నారు. గుర్తించిన అన్ని హింసాత్మక కేంద్రాల్లో, క్రిటికల్ పోలింగ్‌స్టేషన్లలో , అలాగే 1,200 మంది పైబడి ఓటర్లు కలిగిన పోలింగ్‌స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పీడబ్ల్యుడీ ఓటర్లకు, 80 ఏళ్ల దాటినవారికి ఇంటి వద్దే ఓటువేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు., ఇందుకువారు ఫారం-8ద్వారా దరఖాస్తు చేసుకోవలసివుం టుందన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి ,నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఆర్డీవో పీ. శ్రీఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీకుమారి, నగరపాలకసంస్థ ఏసీ రాజ్యలక్ష్మీ, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



పోస్టర్లును ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

10 నుంచి రోప్ స్కిప్పింగ్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి7: ఆంధ్రప్రదేశ్ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట 10వ లైనులోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ఈనెల 10 నుంచి రెండు రోజుల పాటు దక్షిణ మండల రోప్‌స్కిప్పింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసి యేషన్ కార్యదర్శి ఈ.ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పీ.తిరుపతిరావులు తెలిపారు. బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోటీలకు వివిధ రాష్ట్రాలనుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు మౌనిక, ఇమ్మానియేల్, పవన్ చక్రి, విజేత ఐటీ ఫౌండేషన్ డైరక్టర్ నిమ్మల సురేష్ పాల్గొన్నారు.

పారా రాష్ట్ర స్విమ్మింగ్ పోటీలకు పేర్లు నమోదు

ఈనెల 21న వైజాగ్, రైల్వే క్రికెట్ మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాల,బాలికల విభాగాల్లో జరిగే రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడిజిల్లాలో ఉన్న పారా క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈనెల 10వ తేది సాయంత్రం వరకు జరుగుతుందని, ఆసక్తికలిగిన పారాక్రీడాకారులు 7013569514, 9390131777 నెంబర్లును సంప్రదించాలని సూచించారు.

ముగిసిన క్విజ్, వక్తృత్వ పోటీలు...

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 7: స్థానిక హిందూ కళాశాలలోని ఇంటర్మీడియట్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఇంటర్మీడియట్ విద్యార్థుల అంతర్ కళాశాలల క్విజ్, వక్తృత్వ పోటీలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రముఖవిద్యావేత్త విజ్ఞాన్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ లీలామోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్‌లో, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో వక్తృత్వంలో పోటీలను నిర్వహించారు. 22 జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమద్భగవద్గీత ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి7: బృందావన గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయప్రాంగణం అన్నమయ్య కళావేదికపై జరుగుల బంగారుబాబు సౌజన్యంతో బుధవారం శ్రీమద్భగవద్గీతలోని కర్మసన్న్యాస యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ కమిటి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచనం చేశారు.

ప్రజా ప్రయోజనాలు లేని రాష్ట్ర బడ్జెట్

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి7: శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఎన్నికల బడ్జెట్‌లా వుందని, ప్రజల ప్రయోజనాలు అభివృద్ధికి సంబంధించిన అంశాలేవీ బడ్జెట్‌లో లేవని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి సంబంధించిన అంశంపై మౌనం వహించారని, వేలాది మంది నిర్వాసితులను గూర్చి బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, మునిసిపల్ కార్మికులు, సర్వ శిక్షాభియాన్ ఉద్యోగులకు వారి పోరాటాల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపు ప్రస్తావన లేదన్నారు. ఆర్భాటంగా ప్రకటించిన జగనన్నకాలనీల నిర్మాణానికి నిధులు పెంపులేదని, వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యతనివ్వలేదని, ఈ బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

మంగళగిరి తహసీల్దార్‌పై ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి తహసీల్దార్ జీవీ రాంప్రసాద్‌పై టీడీపీ రాష్ట్ర నాయకత్వం ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేసింది. బుధవారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎండీ అహ్మద్‌షరీఫ్ సీఈవోకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ తహసీల్దార్ రాంప్రసాద్ మంగళగిరిలో వైసీపీ నేతలతో కుమ్మక్కై పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆయన్ని డిప్యూటేషన్‌పై చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయంలో నియమించడం వలన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నేతలతో కలసి వారికి లబ్ధిచేకూర్చే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా ఆయనను డిప్యూటేషన్ వర్కు నుంచి రిలీవింగ్ చేయాలన్నారు.

17,18 తేదీల్లో బాలోత్సవ్

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 7: ఈనెల 17,18 తేదీల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక హిందూ కళాశాలలో 'బాలోత్సవ్' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు వెల్లడించారు. ఈమేరకు బుధవారం హిందూకళాశాలలో కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించడానికి నిర్వహించే బాలోత్సవ్‌లో విద్యార్థులు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి బీ.ప్రసాద్ బాలోత్సవ్ కన్వీనర్ ఎం.బోసుబాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ పనితీరు అత్యంత దారుణం

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత తాళ్ల వెంకటేశ్ యాదవ్

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి, వైసీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి విడదల రజనీ ఆశాఖ పనితీరును అత్యంత దారుణంగా దిగజార్చారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత తాళ్ల వెంకటేశ్ యాదవ్ ఆరోపించారు. సంవత్సరాల తరబడిగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం నిధుల చెల్లింపులో జాప్యం కారణంగా కొన్ని ఆసుపత్రుల్లో పేదలకు ఉచిత వైద్య సేవలు అందటంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి నియోజకవర్గం నాదెండ్ల మండలం తూబాడులో అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఇద్దరు చిన్నారులకు సరైన చికిత్స జరగక పోవడం వలన వారు మృతి చెందడం బాధాకరమన్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ వైద్యం, వైద్య పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందన్నారు.

ఇండిగ్లోబల్, క్లినోసాల్ రీసెర్చ్ సంస్థలతో 'చిప్స్' ఎంవోయూ



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర తదితరులు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 7: స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలతో ఇండిగ్లోబల్ ల్యాబ్స్ క్లినోసాల్ రీసెర్చ్ సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో ఇరు సంస్థలు రీసెర్చ్, బోధన తదితర అంశాలపై పరస్పర సాంకేతిక నైపుణ్యాల మార్పిడిని చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో గ్లోబలైజేషన్ ఆఫ్ క్లినికల్ ట్రైల్స్‌లో యువతకు 'ఉపాధి అవకాశాలు, సవాళ్ళు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో క్లినోసాల్ రీసెర్చ్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ సాంబశివరావు, ఇండిగ్లోబల్ ల్యాబ్స్ సీఈవో ముజబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

పదిరోజుల్లో పారిశుధ్య పనుల్లో మార్పు రావాలి

● నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరు ఆదేశం

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7: నగరంలో రానున్న 10 రోజుల్లో పారిశుధ్య పనుల్లో మార్పు రావాలని, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులతో నగరంలో పారిశుధ్య పనులు, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, చెత్త తరలింపులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటరీ సూపర్‌వైజర్లు ప్రతి రోజు ఒక సచివాలయం పరిధిలో పర్యటించి సమగ్రపారిశుధ్య పనులు జరిగేలా పర్యవేక్షణచేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వారిగా పారిశుధ్య కార్మికుల రేషనలైజేషన్ జరగాలని, ప్రధాన రోడ్లు, డ్రెయిన్ల పూడిక తీత, ఇంటింటి చెత్త సేకరణకు కార్మికులకు బాధ్యతలు కేటాయించాలని ఎస్ఎస్‌లను ఆదేశించారు. ఈ-ఆటోలు ఉన్న ప్రాంతాల్లో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, తడిపొడి వేరుగా జరగాల్సిందేనని స్పష్టం చేశారు. క్లస్టర్ కంపోస్ట్ యూనిట్లను, టెర్రస్, కిచెన్‌గార్డెన్‌లను ప్రోత్సహించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో రాత్రివేళ పారిశుధ్య పనులు చేపట్టడానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని సీఎంవోహెచ్, ఎంహెచ్‌వోలను ఆదేశించారు. పారిశుధ్య పనుల కోసం కేటాయించిన ట్రాక్టర్లు, కాంపాక్టర్లు, ఈ-ఆటోలకు జీపీఎస్, డంపింగ్‌యార్డ్‌ల వద్ద సీసీ కెమెరాల విజువల్స్ వచ్చేలా అధునాతన కమాండ్‌కంట్రోల్ రూంను జీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు. సమావేశంలో ఎస్.ఈ. సుందర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ డీ.ఆశా, ఎంహెచ్‌వో(ఎఫ్ఏసీ) మధుసూదన్, ఈఈ కొండారెడ్డి, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆనందకుమార్, ఆయుబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల దరఖాస్తులను శ్రద్ధతో పరిశీలించాలి

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఆర్వో రాజ్యలక్ష్మి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7: ఓటరు మార్పు, చేర్పు, తొలగింపుల దరఖాస్తులను బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో కే.రాజ్యలక్ష్మీ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గ బీఎల్వోలు, సూపర్‌వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుదిజాబితాపై ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఓటరు తుది జాబితా అనంతరం నూతన ఓటునమోదు, మార్పుల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని బీఎల్వోలు నిశితంగా పరిశీలించాలన్నారు. తొలగింపు దరఖాస్తులు వస్తే జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం తప్పనిసరి అని అన్నారు. బిఎల్‌వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడ మౌలిక వసతులపై సూపర్‌వైజరీ అధికారి, ఏఈఆర్‌వోలకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్‌వోలు సీహెచ్.శ్రీనివాస్, టీ.వెంకట కృష్ణయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, డిప్యూటీ తహసీల్దార్లు బీ.బాస్కర్, మల్లేశ్వరరావు, సూపర్‌వైజరీ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి ఆరిఫ్

టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

గుంటూరు, ఫిబ్రవరి 7 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాలంటూ రామిరెడ్డితోటతోట 5వ లైనులో టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో యువకులకు ఉద్యోగ, ఉపాధి కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. జనసేన, టీడీపీ కూటమిప్రభుత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, తూర్పు నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు కృషిచేస్తానని తెలిపారు. జనసేన గుంటూరు అర్బన్ నగర అధ్యక్షుడు నేరెళ్ళ సురేష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. వైసీపీని రాష్ట్రం నుంచి తరిమి కొట్టేందుకు జనసేన, టీడీపీ శ్రేణులు ఉమ్మడిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దార్ల మహేష్, షేక్ సాబీర పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

గుంటూరు, ఫిబ్రవరి 7 : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్‌లోని ఓ ఇంటిపై దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్ళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ సీఐ విజయచంద్రకి అందిన సమాచారం మేరకు, ఆయన తన సిబ్బందితో కలిసి పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయినగర్ 2వ లైన్‌లో ఒక ఇంటిపై దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.57,440 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయచంద్ర తెలిపారు.

మద్యం బాటిళ్లు కలిగివున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు, ఫిబ్రవరి 7: అక్రమంగా మద్యం బాటిళ్ళు కలిగివున్న వ్యక్తిని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేసారు. బుధవారం రాత్రి నగరంపాలెం పీఎస్ ఎస్ఐ జి.అంజయ్య సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ చుట్టుగుంట సెంటర్ వద్దకు రాగా, అక్కడ ఒక వ్యక్తి నల్లటి బ్యాగుని కలిగివుండి, పోలీసులను చూసి పారిపోవుటకు ప్రయత్నించగా ఆ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతని పేరు ముప్పాళ్ళ శివన్నారాయణ అని, తనది పాదర్తివారి వీధి, బాబు బిర్యాని సెంటర్ ఎదురు, ఏటుకుర్ రోడ్డు అని చెప్పాడు. ఆ వ్యక్తి బ్యాగుని సోదా చేయగా నాలుగు మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం కలిగివున్నడన్న విషయం మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మహిళ అరెస్ట్

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మహిళను నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రవీంద్ర నాయక్‌కి అందిన సమాచారం మేరకు కోదండ రామయ్యనగర్ 4వ లైను వద్ద ముళ్ళపూడి రమణ అనే మహిళ తన ద్విచక్రవాహనంపై 70 కేజీల రేషన్ బియ్యాన్ని తరలిస్తూండగా ఆమెను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

నల్సార్‌లో మేనేజ్‌మెంట్ కోర్సులు



హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా'కి చెందిన మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం- ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది.

- వెబ్‌సైట్: doms.nalsar.ac.in

బీబీఏ-ఎంబీఏ ప్రోగ్రామ్(ఐపీఎం)

ఇది ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. యూజీసీ నిబంధనల మేరకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ పాలసీతో ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఇందులో మొత్తం 15 టర్మ్‌లు ఉంటాయి. రెండో ఏడాది తరవాత అభ్యర్థులు స్టార్టప్ కంపెనీల్లో ఆరు నుంచి ఎనిమిది వారాలు ఇంటర్న్‌షిప్; మూడు, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తయ్యాక స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

ఎంబీఏ లెవెల్ స్పెషలైజేషన్లు: బిజినెస్ రెగ్యులేషన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, కోర్టు మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ అండ్ సస్టెయినబిలిటీ, మార్కెటింగ్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్.

సీట్లు: మొత్తం 66 సీట్లున్నాయి.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఇంటర్ స్థాయి చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌మెట్(యూజీ)/ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 31

ఎంబీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

స్పెషలైజేషన్లు: కార్పొరేట్ గవర్నెన్స్, ఇన్నోవేషన్ అండ్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ రెగ్యులేషన్స్, కోర్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్. **సీట్లు:** మొత్తం 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్(ఎన్‌మెట్ పీజీ)2024/క్యాట్ 2023 అర్హత పొంది ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18

ఎఫ్ఆర్ఐలో ఎమ్మెస్సీ

డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్ఆర్ఐ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఫారెస్ట్రీ, ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, సెల్యులోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. బేసిక్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, అర్థమెటిక్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, కంప్యూటేషనల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ టేబుల్స్, గ్రాఫ్స్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్, ఒకాబులరీ, గ్రామర్, ఇడియమ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 15 శాతం మార్కులు రావాలి.



ముఖ్య సమాచారం

- ★ డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45శాతంచాలు.
- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- ★ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 8
- ★ **ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మే 19
- ★ **చిరునామా:** రిజిస్ట్రార్, ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ), పీఓ న్యూ ఫారెస్ట్, కౌలాగర్ రోడ్, డెహ్రాడూన్-248195
- ★ **వెబ్‌సైట్:** www.fridu.edu.in

నాగార్జున వర్సిటీలో డ్యూయెల్ డిగ్రీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ)- బీటెక్+ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ సెల్ఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిని డా.వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. మొత్తం 510 సీట్లు ఉన్నాయి. ఏఎన్‌యూ నిర్వహించే ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్(ఏఎన్‌యూఈఈటీ) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీటెక్ డిగ్రీతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.


విభాగాలు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 120, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 120, మెకానికల్ ఇంజనీరింగ్ 30, సివిల్ ఇంజనీరింగ్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 30, డేటా సైన్స్ 60, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 60, సైబర్ సెక్యూరిటీ 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **ఏఎన్‌యూఈఈటీ 2024 తేదీ:** ఏప్రిల్ 7
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 10
- **వెబ్‌సైట్:** www.anucet.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Fe0ahm9లో చదవండి.

విధ్వంసాల జాతర



రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కావ్యాథాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. ఈనెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం రవితేజ్ యాక్షన్ హంగామా కనిపించింది. సరికొత్త మేకోవర్‌లో ఆయన కనిపించారు. 'వచ్చాడంటే మోతరా, విధ్వంసాల జాతర' అంటూ ఆయన పలికిన డైలాగ్‌లు మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా ఉన్నాయి. ఈ చిత్రంలో నవదీప్, అవసరాల శ్రీనివాస్, మధుబాల, అజయ్‌ఘోష్, శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్రలు పోషించారు. సంగీతం: డేవ్ జాంద్

మానవత్వాన్ని పంచే మొయినుద్దీన్ భాయ్



'మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో...మానవత్వాన్ని అందరితో పంచుకో' అంటున్నారు రజనీకాంత్. 'లాల్ సలామ్' చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ పలికిన డైలాగ్ ఇది. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. గ్రామీణ వాతావరణం, రాజకీయాలు, మతవిద్వేషాల నేపథ్యంలో సాగే కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. రజనీకాంత్ చాలా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఐశ్వర్య దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్, క్రికెటర్ కపిల్ దేవ్ కీలకపాత్రలు పోషించారు. సుభాస్కరన్ నిర్మించారు.

ఫ్యామిలీస్టార్ ప్రేమగీతం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఫ్యామిలీస్టార్'. ఆయనకు జోడీగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం చిత్రబృందం 'నందనందనా' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టింది. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీ సుందర్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్. ఎడిటర్: మార్తాండ్ కే వెంకటేశ్

మార్చిలో గామి ఆగమనం



విష్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతున్న అడ్వంచర్ డ్రామా 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. 'గామి' చిత్రాన్ని మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విష్వక్‌సేన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యాధర్ 'గామి' సినిమా కోసం చాలా పరిశోధన చేశాడు. సినిమా పూర్తి చేయడానికి దాదాపు నాలుగున్నరేళ్లు పట్టింది. వారాణసిలో షూటింగ్ చేస్తున్నప్పుడు చాలామంది నన్ను చూసి నిజమైన అఘోరా అనుకున్నారు. నాకు ధర్మం చేశారు. ఓ ముసలామె ఆప్యాయంగా భోజనం పెట్టారు. ఈ సినిమా కోసం చాలా కష్టాలు పడ్డాం. ట్రైలర్ మైండ్‌బ్లోయింగ్‌గా ఉంది. సినిమా అందరినీ అలరిస్తుంది' అన్నారు. విద్యాధర్ మాట్లాడుతూ 'అఘోర శంకర్ హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే 'గామి' కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నించాం. విష్వక్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఏదడిగితే అది చేశారు. గడ్డకట్టించే చలిలో సైతం నటించాడు. ఈ సినిమా కోసం కుంభమేళాని చిత్రీకరించాం' అని చెప్పారు. కార్తీక్ శబరీష్ మాట్లాడుతూ '2018లో ఈ సినిమాను మొదలుపెట్టాం. చాలా ఎగ్జయిటింగ్ కంటెంట్ ఉన్న సినిమా ఇదని తెలిపారు. ఈ చిత్రంలో చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఎంజి అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. సంగీతం: నరేశ్ కుమారన్.

రెండింతల వినోదం




సిద్దు జొన్నలగడ్డకు స్టార్ స్టేటస్‌ను తెచ్చిన చిత్రం 'డీజే టిల్లు'. 'అట్లుంటది మనతోని' అంటూ ఆ సినిమాలో ఆయన పంచిన వినోదం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి టిల్లూ బాయ్ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'డీజే టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లూ స్క్వేర్' రూపొందుతోంది. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. మార్చి 29న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం సిద్దు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది. కారులో హీరో హీరోయిన్ల రొమాన్స్, రాధికతో ప్రణయం గురించి టిల్లూ గుర్తు చేసుకొనే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సిద్ధు తనదైన స్టైల్లో మరోసారి డైలాగ్‌లతో మ్యాజిక్ చేశాడు. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. రామ్ మిరియాల, అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సాయిప్రకాశ్ ఉమ్మడి సింగు. ఎడిటర్: నవీన్ నూలి

ఆర్ఆర్ఆర్ ఓ అద్భుతం

రాజమౌళిపై కామెరూన్ ప్రశంసలు





హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మరోమారు రాజమౌళిని అభినందనలతో ముంచెత్తారు. 'ఆర్ఆర్ఆర్ సినిమా ఓ అద్భుతం అని ప్రశంసించారు. సాటర్న్ అవార్డ్స్ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు కామెరూన్ బదులిస్తూ "ఆర్ఆర్ఆర్ చాలా అద్భుతమైన సినిమా అనిపించింది. ఆ అనుభూతినే రాజమౌళితో పంచుకున్నాను. ప్రపంచం మొత్తం ఆ సినిమాను ఇష్టపడింది. భారతీయ సినిమా ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటడం మంచి పరిణామమని' పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రబృందం కామెరూన్‌కు ధన్యవాదాలు తెలిపింది. గతేడాది జరిగిన క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల కార్యక్రమంలో రాజమౌళి, కామెరూన్ కలిశారు. ఆ సందర్భంలో కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' అద్భుతంగా ఉందని కొనియాడారు. ప్రస్తుతం మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి ఓ చిత్రం రూపొందిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YowEbvo లో చదవండి.

నన్నే హీరోయిన్‌గా అనుకున్నారు



సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మీడియాతో మాట్లాడారు.

- ఈ కథ రాసుకున్నప్పుడే నన్ను హీరోయిన్‌గా అనుకున్నానని ఆనంద్ చెప్పారు. స్టోరీ చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. 'అసలు ఇలాంటి కథను ఎలా ఊహించగలిగారో' అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. అందుకే నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం అడిగాను. ఆనంద్ పాత్ర గురించి వివరంగా చెప్పాక నేను చేయగలననే నమ్మకం ఏర్పడింది.
- పూర్తిస్థాయి వినోదం పంచే చిత్రమిది. ప్రేక్షకులకు మంచి సందేశం, ఉత్కంఠభరితమైన ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. అద్భుతం అనిపించే అతీంద్రియ శక్తుల నేపథ్యం ఉంటుంది. సినిమా నిర్మాణం విషయంలో మేకర్స్ ఎక్కడా రాజీపడలేదు.
- 'స్వాతిముత్యం, మిడిల్ క్లాస్ మెలోడీస్' చిత్రాల్లో పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపించాను. ఈ చిత్రంలో వాటికి భిన్నంగా 'భూమి' అనే గిరిజన యువతి పాత్రలో కనిపిస్తాను. ఊళ్లో తనొక్కతే చదువుకున్న అమ్మాయి. అందంగా, అమాయకంగా కనిపిస్తుంది. కానీ చాలా బలమైన పాత్ర. యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయి.

ఏం జరిగింది?



విజయ్ శంకర్, సావిత్రి కృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'అంతే.. అలా జరిగిపోయింది'. శ్రీరామ్ అమృతపురి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, సముద్రాల మహేశ్‌గౌడ్ నిర్మించారు. బుధవారం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత ప్రసన్నకుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. యువతను ఆకట్టుకునే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం, ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి జయసూర్య బొంపెం సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్.

నాసిరకం మద్యంతో ప్రాణాలు కోల్పోతున్నారు

● నారా భువనేశ్వరికి విజ్ఞాపన



నారా భువనేశ్వరికి సమస్యను వివరిస్తున్న గడ్డిపాటి పద్మరాణి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7: ప్రభుత్వం తీసుకువచ్చిన నాసిరకం మద్యంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిని అరికట్టాలని కోరుతూ నారా భవనేశ్వరికి ప్రత్తిపాడు మండలం చిన్న కొండ్రుపాడు గ్రామానికి చెందిన లోక్‌సత్తా పార్టీ మాజీ మహిళా కన్వీనర్ గడ్డిపాటి పద్మ రాణి వినతిపత్రం అందజేశారు. ఈ మధ్య చేసిన సర్వేలో కేవలం చిన్న కొండ్రుపాడు గ్రామంలో నాసిరకం మద్యంతో 100మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని నారా భువనేశ్వరి దృష్టికి తీసుకువచ్చారు. సంపాదనంతా మద్యానికి ఖర్చుపెడుతున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే నాసిరకం మద్యాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో మద్యం పూర్తిగా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని నారా భువనేశ్వరిని కోరారు.

వ్యాపారులకు లేబర్ లైసెన్స్ లేకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ కార్మిక శాఖ అధికారి మూర్తి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 7: మంగళగిరి పరిధిలోని వ్యాపారులందరూ లేబర్ లైసెన్సు తప్పనిసరిగా కలిగివుండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సహాయ కార్మికశాఖ అధికారి సీహెచ్ మూర్తి హెచ్చరించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులకు లేబర్ లైసెన్సుపై అవగాహన కల్పించారు. మూర్తి మాట్లాడుతూ లైసెన్సు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, కాలపరిమితి ముగిసిన వారు రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. అన్ని మీసేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపా రు. ఈ నెలాఖరు నాటికి ప్రతి వ్యాపారస్తుడు లైసెన్సు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, వర్తక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని ధర్నా



ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 7: మంగళగిరి పాతబస్టాండు సెంటర్లో ఆటో స్టాండు ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు బుధవారం ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత భాగ్యరాజు మాట్లాడుతూ పాతబస్టాండు సెంటర్లో చేనేత భవన్ నిర్మించడంతో అక్కడ ఆటోస్టాండు కొనసాగించడానికి వీలులేదని కార్పొరేషన్ అధికారులు తెలియజేసినట్టు చెప్పారు. దీంతో పాతబస్టాండు నుంచి నిడమర్రు మీదుగా సుమారు పది గ్రామాలకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు తలెత్తనున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి ఆటోస్టాండు ఏర్పాటుకు స్థలాన్ని చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంటీఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎం రవి, టీ శ్రీరాములు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు దుస్తుల పంపిణీ

తాడికొండ, ఫిబ్రవరి 7: మండల పరిధిలోని కంతేరు గ్రామంలో తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి శిఖా శంకరరావు కుమారుడు శిఖా శాంతిరాజ్ 10 వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు దుస్తులను మంగళవారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిఖా శంకరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన కుమారుడి జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీని యర్ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య పార్టీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, గుంటూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిగురుపాటి అనూఫ్, జనసేనపార్టీ మండల అధ్యక్షుడు గులకవరపు నరేష్, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భువనేశ్వరి 'నిజం గెలవాలి'ని విజయవంతం చేయాలి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, తుళ్లూరు, ఫిబ్రవరి 7: నియోజకవర్గంలోని నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నారా భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఫిరంగిపురం మండలం రేగులగడ్డ గ్రామంలోని నల్లజర్ల చెన్న కేశవరావు కుటుంబాన్ని గురువారం పరామర్శిస్తారన్నారు. అనంతరం తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలోని తోమాటి బాలయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. అక్కడ నుంచి తుళ్లూరులో మోరం సాంబశివరావు కుటుంబాన్ని, రాయపూడిలో గోరగంటి మలికార్జునరావు కుటుంబాన్ని, వెంకటపాలెంలో లంకా నరసింహారావు కుటుంబాలను కలిసి భరోసా కల్పిస్తారన్నారు. వెంకటపాలెంలో మహిళా పాడి రైతులతో కలిసి మాట్లాడతారన్నారు. భువనమ్మ చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుభాని, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిగురుపాటి అనూఫ్, మండల అధ్యక్షుడు తాటి తులసీరామ్, టీడీపీ నాయకులు గడ్డిపాటి సాంబశివరావు, తోకల వెంకటేశ్వర్లు, పాలేటి రమేష్, వడ్ల మూడి సుధీర్, బండ్లమూడి లింగయ్య చౌదరి, షేక్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులతో భువనేశ్వరి సమావేశానికి వెంకటపాలెంలోని స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రావణ్‌కుమార్

రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు

తాడికొండ, ఫిబ్రవరి 7: సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడు రాజధాను లన్నారు ఒక్క రాజధానిని అభివృద్ధి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయటానికి రాజధాని భూములను తాకట్టు పెట్టుకుంటారు కానీ, అమరావతిలో రాజధాని మాత్రం ఉండకూడదనే దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్నారన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం అమరావతిని తరలించాలనుకోవడం తగదన్నారు. విశాఖను ఐటీ హబ్‌గానో, పారిశ్రామిక హబ్‌గానో అభివృద్ధి చేసుకోవచ్చునని తెలిపారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.



తాడికొండలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

కేఎల్‌యూ విద్యార్థినికి అభినందనలు

తాడేపల్లి, ఫిబ్రవరి 7: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోమల్ అనే బాలిక ఎన్‌సీసీ 22 ఆంధ్రా బెటాలియన్‌లో ఎన్‌సీసీ క్యాడెట్‌గా పని చేస్తూ గత నెల 26న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన గణతంత్ర వేడుకలకు ఎంపికై అక్కడ జరిగిన పరేడ్‌లో ఆమె కూడా పాల్గొన్నట్లు కేఎల్‌యూ అధ్యక్షుడు కోనేరు రాజా సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వర్సిటిలో బీటెక్ చదువుతున్న కోమల్ అనే విద్యార్థిని రాష్ట్రపతి పరేడ్‌కు ఎంపిక కావడం, పరేడ్‌కు హాజరు కావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వర్సిటిలో ఎన్‌సీసీ 22 ఆంధ్రా బెటాలియన్ కు చెందిన కోమల్ అనే క్యాడెట్ 70 రోజులపాటు ఒక క్యాంపు తరువాత మరో క్యాంపులో ఎంపిక అవుతూ చివరి గా ఢిల్లీలో పరేడ్‌లో పాల్గొన్నట్టు తెలిపారు. ఢిల్లీకి 27 రాష్ట్రాల నుంచి దాదాపుగా రెండు వేల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికయినట్టు పేర్కొన్నారు. వారిలో 116 మంది మాత్రమే పరేడ్‌లో పాల్గొన్నారని, అందులో తమ విద్యార్థిని కోమల్ పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా కోమల్‌ను ఎన్‌సీసీ లెఫ్టినెంట్ వి.మౌనికను, ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటి వీసీ పార్థసారధివర్మ, ప్రోవీసీలు ఏవిఎస్ ప్రసాద్, ఎన్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సీహెచ్ హనుమంతరావు, సలహాదారులు కేఆర్ఎస్ ప్రసాద్, హబీబుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్ని కోమల్‌ను, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ వి.మౌనికను అభినందించారు.



కోమల్‌ను అభినందిస్తున్న కోనేరు సత్యనారాయణ తదితరులు

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న జగన్ ప్రభుత్వం

● దానబోయిన సుందరరావు యాదవ్

మంగళగిరి, ఫిబ్రవరి 7: బడుగు, బలహీన వర్గాల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ హక్కులను జగన్ ప్రభుత్వం కాలరాస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన బీసీ నేతలతో కలిసి మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి విలేకర్లతో మాట్లాడారు. దేశ ప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామీణ ప్రాంతాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. తమ హక్కుల కోసం గొంతెత్తిన గ్రామసర్పంచులను పోలీసులతో కొట్టించి దమన కాండను సాగించడం దుర్మార్గమన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన గ్రామ సర్పంచులు గ్రామాభివృద్ధి కోసం తమ సొంత నిధులను వెచ్చించి, అందినకాడికి అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధికి తోడ్పాటునందించారని చెప్పారు. ఆయా పంచాయతీలకు రావలసిన నిధులను జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గ్రామాల్లో రోడ్లు, కాలువలు, చెరువులు, వ్యవసాయ క్షేత్రాలకు డొంక రోడ్లు వేయించారని గుర్తుచేశారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులను జగన్ సర్కారు దారిమళ్లించిందని, ఆ నిధులు ఏమయ్యాయో శ్వేతపత్రం విడుదల చేయాలని సుందరరావుయాదవ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నేతలు రుద్రు శ్రీనివాసరావు, దాన బోయిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగల నివారణ మాత్రల పంపిణీ

పెదనందిపాడు, ఫిబ్రవరి 7: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ నులిపురుగల నివారణ దినోత్సవంలో భాగంగా బుధవారం అధికారులు గోడ పత్రికలను ఆవిష్కరించారు. నులిపురుగుల నివారణే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం పాఠశాలల హెచ్ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. వైద్యాధికారి విజయరత్నకుమార్, ఎంఈవో, సీహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

శెనగలో తెగులు నివారణపై అవగాహన

● కేంద్రీయ విశ్వవిద్యాలయ అధికారి

పెదనందిపాడు, ఫిబ్రవరి 7: శెనగ పైరులో ఎండు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలని కేంద్రీయ విశ్వవిద్యాలయ అధికారి ప్రేమరంజితం అన్నారు. మండల పరిధిలోని వరగానిలో రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శాలినీ, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నేత పోతినేనికి మాతృవియోగం



శేషారత్నం (ఫైల్)

మంగళగిరి, ఫిబ్రవరి 7: టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాతృమూర్తి శేషారత్నం (70) బుధవారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పోతినేని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పోతినేని శ్రీనివాసరావును ఫోనులో పరామర్శించారు. శేషారత్నం మృతికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, గుంటక సాంబిరెడ్డి, బూర్ల శ్రీనివాసరావు, కరీముల్లా, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు శేషారత్నం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అంత్యక్రియలు గురువారం ఉదయం 9గంటలకు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పాటిబండ్ల



బాధ్యతలు చేపట్టిన పాటిబండ్ల రాంబాబు

పెదనందిపాడు, ఫిబ్రవరి 7: పెదనందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా పాటిబండ్ల రాంబాబు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నియామకాపత్రాన్ని సీఈవో కె.భాస్కరరావు కమిటీ సభ్యులకు అందజేశారు. సభ్యులుగా బొనిగల సుబ్బారావు, దండా పెద్ద వెంకటేశ్వర్లును నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రావి శ్రీకాంత్, కాకుమాను ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూదస్థావరంపై దాడి.. నలుగురి అరెస్టు

కాకుమాను, ఫిబ్రవరి 7: జూద స్థావరంపై దాడి చేసి నలుగురు జూదరులను అరెస్టు చేసిన సంఘటన మంగళవారం జరిగింది. ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొండపాటూరులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రవీంద్ర తమ సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ 1150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై సీఈవోకి టీడీపీకి ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి తహసీల్దార్ జీవీ రాం ప్రసాద్‌పై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్టో రల్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేసింది. బుధవారం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎండీ అహ్మద్ షరీఫ్ సీఈవోకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ తహసీల్దార్ రాంప్రసాద్ మంగళగిరిలో వైసీపీ నాయకులతో కుమ్మక్కు అయి పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆయన్ని డిప్యూటేషన్‌పై చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయంలో నియమించడం వల్ల సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నాయకులతో కుమ్మక్కయ్యి వారికి లబ్ధి చేకూర్చి పెట్టే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా ఆయన్ని తక్షణమే డిప్యుటే షన్ వర్కు నుంచి రిలీవింగ్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


షర్మిలా కారు వద్దకు చేరి జ్ఞాపికలను అందజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ఘన స్వాగతం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 7: బాపట్ల పర్యటనలో పాల్గొనేందుకు వెళ్లతున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి బుధవారం మార్గం మధ్యంలోని పొన్నూరు పట్టణంలో ఘన స్వాగతం లభించింది. తొలుత తెలగపాలెం రామమందిరం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు షర్మిలకు ఘన స్వాగతం పలికారు. షర్మిల కారులోనే ఉండి కార్యకర్తలకు అభివాదం తెలుపుతూ ముందుకు సాగారు. అనంతరం పట్టణంలోని ఐల్యాండ్‌సెంటర్ వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు షర్మిలకు ఘనస్వాగతం పలికి కారు. బాపట్ల బహిరంగ సభ కార్యక్రమానికి సమయం కావటంతో కొద్ది సమయానికే షర్మిల అక్కడ నుంచి బయలుదేరి వెళ్లారు.

హుండీ ఆదాయం రూ.40.55 లక్షలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 : వైకుంఠపురం ఆలయానికి రూ.40.55 లక్షల ఆదాయం లభించింది. లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తులు సమర్పించిన హుండీలలో కానుకల లెక్కింపు నిర్వహించారు. బంగారం 51.6 గ్రాములు, వెండి 321గ్రాములు, నగదు రూ.40,54,922 లభించింది. ప్రత్యేక అధికారి అమర్‌నాథ్, ఈవో తిమ్మానాయుడు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంభం సాయిబాబు, బోర్డు సభ్యులు, అర్చకులు, యూనియన్ బ్యాంకు సిబ్బంది, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

16న గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టే నిరసన ఉద్యమానికి మద్దతుగా నిర్వహించే గ్రామీణ బంద్‌లో కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రం కొల్లిపరలో సంఘ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్ అధ్యక్షతన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదను పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి, కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చిందని అన్నారు. కార్మికులు, రైతులు, శ్రామికవర్గం తమ హక్కుల సాధన, పోరాడి సాధించుకున్న చట్టాల సంరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నేతలు కే.భవానీ, టీ.దీప్తి, రమేష్, ముక్కంటి, ములకా శివకుమారి తదితరులు పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యులు

మత విద్వేషకులపై చర్యలు తీసుకోవాలి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 : మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సేవా ట్రస్ట్ సభ్యులు కోరారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలలో రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, డీఎస్పీని కలిసి వారిపై అట్రాసిటి కేసు పెట్టేందుకు సమాయత్తం అవుతున్నారని తెలిపారు. వెంటనే పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అబ్రహంలింకన్, సందీప్, దాను, కిషోర్, దేవయ్య, భూషణం పాల్గొన్నారు.


స్వర్ణోత్సవ సంబరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

విద్యార్థులకు నైతిక విలువలను నూరిపోయాలి

● నెహ్రూనికేతన్ స్వర్ణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 : విద్యార్థులలో నైతిక విలువలను చిన్ననాటి నుండే నూరిపోయాలని, నేటి సమాజం ఎదుర్కొంటున్న రుగ్మతల నివారణకు అప్పుడే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్వర్ణోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ప్రారంభించారు. స్కూల్ ఎండీ మురళీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశలో చేయాల్సింది చేయడంలేదన్నట్లుగా ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లతో కాలంగడపటం, ఆధునిక ప్రపంచంతో పోటీ పడలేమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిత్యం గమనిస్తూ ఉండాలని వారేం చేస్తున్నారో తెలుసుకుని సన్మార్గంలో పెట్టాల్సిన బాధ్యత విస్మరించకూడదన్నారు. పిల్లలకు ఆసక్తివున్న రంగాన్ని గుర్తించి అందులో వారిని ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే కాని జీవితంలో రాణించే పరిస్థితి లేదన్నారు. విశ్రాంత ఆచార్యులు గుజ్జర్లమూడి కృపాచారి, స్కూల్ ఈడీ గీతాకాంత్ తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.


సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న విద్యార్థులు

నులిపురుగులను సమూలంగా నివారిద్దాం

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం
● 9 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ


వాల్‌పోస్టరును ఆవిష్కరించి, ఆల్‌బెండజోల్ మాత్రలను అందజేస్తున్న ఎంపీడీవో శిల్ప, జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ

తెనాలి,మారీసుపేట ఫిబ్రవరి7: నులిపురుగులన సమూలంగా నివారిద్దా మని,ఈనెల 9 నుంచి నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సావాన్ని జయప్రదం చేయలని జిల్లా మలేరియా అధికారి, తెనాలి ప్రోగ్రాం ఆఫీసర్ తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పిలుపునిచ్చారు. ఈమేరకు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్యక్రమ వాల్‌పోస్టరు ను ఎంపీడీవో కావూరి శిల్పతో కలసి ఆయన ఆవిష్కరించారు. కొలకలూరు, జాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్లు సుబ్బారావు, దిలీప్‌లకు ఆల్బెండజోల్ మాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా మురళికృష్ణ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలనుఅందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో డివిజన్ సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకంత్, వీ. పున్నారెడ్డి, విస్తరణ అధికారి రాజయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

9 నుంచి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

కొల్లిపర: నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 9 నుంచి 19 సంవత్సరాలలోపు వారందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలను వేయించాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మండల వైద్యాధికారి లక్ష్మీసుధ, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ.. నులిపురుగు జీర్ణవ్యవస్థలో ఉండటం వలన పిల్లల ఎదుగుదల తగ్గడంతో పాటు వివిధ రోగాలబారిన పడే అవకాశం ఉందన్నారు. మండల వైద్యాధికారి లక్ష్మీ సుధ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ప్రతి విద్యార్థికి ఆల్‌బెండజోల్ మాత్రలను అందజేయా లని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఎంఈవో లు సాల్మన్‌రాజు, డాక్టర్ వీ.ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలు తహసీల్దార్‌గా రమాదేవి

చేబ్రోలు, ఫిబ్రవరి7: చేబ్రోలు తహసీల్దార్‌గా పీ.రమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రమాదేవి నెల్లూరు జిల్లా కొడవల్లూరు నుంచి బదిలీపై చేబ్రోలు వచ్చారు. చేబ్రోలు తహసీల్దార్‌గా పనిచేసిన కేవీ గోపాలకృష్ణ కలెక్టరేట్‌కు బదిలిపై వెళ్లారు. నూతన తహల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రమాదేవిని కార్యాలయ అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేసారు.

10న ఏసురత్నం సంస్మరణ సభ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 : ఈ నెల 10న ప్రతిఘటన ఉద్యమ దళసారధి కనపర్తి ఏసురత్నం సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, సమతా, శివకృష్ణలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని ఏసీ కళాశాల ఆవరణలో ఈ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజా స్వామికవాదలు ఈ సభను జయప్రదం చేయాలని కోరారు.


తనిఖీ వివరాలను వెల్లడిస్తున్న విద్యుద్ విజులెన్స్ ఈఈ మూర్తి

విద్యుత్‌శాఖ అధికారుల తనిఖీలు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి7: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 48 మంది సిబ్బంది 3 బృందాలు ఏర్పడి 3095 సర్వీసులు తనిఖీ చేసారు. అదనపులోడు కింద 115 సర్వీసులకు రూ.5.35 లక్షలు, మాల్ ప్రాక్టీస్ కింద 3 కేసులకు రూ.5వేలు జరిమానా విధించారు. ఈ తనిఖీలను విద్యుత్ విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, బాపట్ల ఈఈ జీ.ఆంజనేయులు పర్యవేక్షించారు. తనిఖీల్లో డీఈఈలు పీవీఆర్ మల్లికార్జునరావు, ఎం.శ్రీనివాసరావు, డీఏఈ ఎం.వెంకటనారాయణ, బాపట్ల డివిజన్ అధికారులు తనిఖీలలో పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ లక్ష్మణరావు నుండి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వివిధ పోటీల్లో 'వైష్ణవి' విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 : జిల్లా స్థాయిలో జరిగిన క్విజ్, డిబెట్ పోటీల్లో వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గుంటూరు హిందూ కళాశాలలో బుధవారం ఈ పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో ఖాదర్ షరీఫ్, మణిసుబ్బారావు, లింగేశ్వరరెడ్డిలు జిల్లాలో ప్రథమ స్థానాన్ని సాధించారు. డిబేట్ పోటీల్లో దుర్గాలక్ష్మీ, కమల ద్వితీయ స్థానం సాధించారు. అనంతరం ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


ఆలపాటి పెండ్లి కానుకను అందిస్తున్న టీడీపీ శ్రేణులు

'ఆలపాటి పెళ్లికానుక' అందజేత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని కఠెవరం గ్రామానికి చెందిన శిఖా సాంబశివరావు, రోజాకుమారి దంపతుల కుమార్తె సూజన్ వివాహాన్ని పురస్కరించుకుని బుధవారం టీడీపీ నేతలు 'ఆలపాటి పెళ్లి కానుక'ను అందజేశారు. వధువుకి బంగారపు ఉంగరం, నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులను స్థానిక టీడీపీ నేతలు, శ్రేణులు కలసి అందజేసి ఆశీస్సులందించారు.

అమ్మ సేవా నిలయానికి విరాళం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి7: అమ్మ సేవా నిలయం నూతన భవన నిర్మాణానికి దాతలు బుధవారం రూ. లక్ష విరాళం అందచేసారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో నిర్మాణదశలోవున్న అమ్మా సేవా నిలయం భవన నిర్మాణానికి పట్టణానికి చెందిన చేరెడ్డి మాధవరావు, తులసీ దేవి దంపతలు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆ విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఆంటోని స్వామి, లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అన్నక్యాంటీన్‌లకు దాతల సహకారం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 7: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లకు దాతల సహకారం అభినందనీయమని టీడీపీ నేతలు తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో బుధవారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో, శివాజిచౌక్‌లో అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్, మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, గుమ్మడి ప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేఎంజేలో ప్రాంగణ ఎంపికలు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి7: స్థానిక చెంచుపేటలోని జేఎంజే మహిళా కళాశాలలో బుధవారం ఇంగ్లీష్ పర్‌యు (గుంటూరు) వారిచే డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. విద్యార్థులకు మూడు దశలలో 174 మందికి పరీక్షలను నిర్వహించిగా వారిలో 31 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సిస్టర్ థెరిస్సామ్మ పాల్గొని క్యాంపస్ డ్రైవ్‌లో ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ పర్‌యు మెనేజింగ్ డైరెక్టర్ వీ.ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ వీ.ఈశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైని, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ట్రైనింగ్, ప్లేస్‌మెంటు ఆఫీసర్ డాక్టర్ జీ. సుధాకరయ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన వేణుగోపాల్‌రెడ్డి

మాజీ వైమానిక దళ అధికారి

వేణుగోపాల్‌రెడ్డి జనసేనలో చేరిక

కొల్లిపర, ఫిబ్రవరి 7: తెనాలి నియోజకవర్గం, కొల్లిపరకు చెందిన మాజీ వైమానిక దళ అధికారి భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి జనసేన పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వేణుగోపాల్‌రెడ్డికి పార్టీ కండువా వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈయన గతంలో రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ శాఖలో బయో మెడికల్ ఇంజినీర్‌గా 25 సంవత్సరాలుగా విధులు నిర్వహించారు. ఈయనతో పాటు తెనాలి నియోజకవర్గం నుంచి పలువురు జనసేనలో చేరారు. కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న రత్నాకర్

రత్నాకర్‌కు సినిమా లెజండరీ అవార్డు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 : పట్టణానికి చెందిన కళాకారుడు కనపర్తి రత్నాకర్ తెలుగు సినిమా లెజండరీ మెమోరియల్ అవార్డు అందుకున్నారు. నేస్తం ఫౌండేషన్, తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో మంగళవారం రాత్రి తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న వారిని గుర్తించి ఈ అవార్డులు అందించారు. నిర్మాత ఏఎం రత్నం, నిర్వాహకులు మోహన్‌గౌడ్, విజేంద్రవర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కనపర్తి రత్నాకర్‌ను ఈ సందర్భంగా పలువురు కళాకారులు అభినందించారు.


మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ రాష్ట్ర ఏడీసీ చంద్రకుమార్, ఆర్‌జేసీ సత్యనారాయణమూర్తి, కమిటీ సభ్యులు.

కృష్ణయజుర్వేద పారాయణం పోస్టు భర్తీకి

ముగిసిన మౌఖిక పరీక్ష

పెదకాకాని, ఫిబ్రవరి 7: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఖాళీగావున్న కృష్ణ యజుర్వేద పారాయణం పోస్టు భర్తీకి చేపట్టిన మౌఖిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర దేవాదాయశాఖ కార్యాలయం నియమించిన కమిటీసభ్యులైన వెంకటరామకృష్ణశర్మ (రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, నెల్లూరు), కే.త్రినాధ కళ్యాణచందు (శ్రీకాళహస్తి దేవస్థానం) వారిచే, రాష్ట్ర దేవాదాయశాఖ ఏడీసీ టీ.చంద్రకుమార్, సత్యనారాయణమూర్తి, ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసరెడ్డిల పర్యవేక్షణలో అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ పోస్టుకు మొత్తం 56 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 43 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు సంబంధించి ఉత్తీర్ణత అభ్యర్థిని రాష్ట్ర దేవాదయ శాఖకమిషనర్‌కు నివేదిక ద్వారా సమర్పించి తదుపరి వెల్లడించడం జరుగుతుందని ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమ్మి శెట్టి శివశంకర్ రావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అర త లేని వారికి హాల్ టికెట్ అందజేత..

అధికారులు పరీక్షకు అర్హతలేని కొందరికి హాల్ టికెట్‌ను పంపించారని మౌఖిక పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ఆరోపించారు. మాకు అన్ని అర తలు ఉన్నాయని.. కానీ కొందరికి అర్హతలు లేవని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.


ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందిస్తున్న మాజీమంత్రి ఆలపాటి తదితరులు

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

● పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్
● ఆలయ అభివృద్ధికి టీడీపీ నేతల విరాళం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి7 : మండల పరిధిలోని అంగలకుదురు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించారు. కార్యక్రమానకి ముఖ్య అతిధిగా మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదలను అందచేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు, బెల్లంకొండ సాంబశివరావు, ఉపాధ్యక్షుడు మునగాల గోపాలకృష్ణలకు ఆలపాటి చేతులమీదగా గ్రామ పార్టీ సభ్యులు రూ.15000లను ఆలయ అభివృద్ధికి అందజేశారు. మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, టీడీపీ నేత కరణం వెంకటేశ్వరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, సర్పంచ్ ఉసరపు రాజ్యలక్ష్మి, బొద్దులూరి వేణు, సాయి గిరి, అలపర్తి శ్రీకృష్ణ, బీ. శ్రీనివాసరావు, వీరంకి నాగయ్య పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు ఆలపాటి పరామర్శ.

తెనాలి పట్టణంలోని 38వ వార్డులో నివసిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఒంగోలు దుర్గాప్రసాద్ ఆరోగ్య సమస్యలకు చికిత్సను పొంది స్వగృహానికి వచ్చారు. బుధవారం అయనను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరామర్శించారు. త్వరగా కొలుకొని పార్టీ కార్యక్రమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరి ప్రసాద్, శాఖమూరి నారాయణ ప్రసాద్, ఒంగోలు వాసు, సయ్యద్ షావుల్, నేతలు తదితరులు పాల్గొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న దావులూరి పాలెం గ్రామ టీడీపీ కార్యకర్త దొంతగాని గోవిందరాజులను ఆలపాటి పరామర్శించారు. బాధితుడికి అందతున్న వైద్యం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


నందీశ్వరునికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నందీశ్వరుని పంచామృతాభిషేకం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7: పట్టణ పరిధిలోని చినరావూరులో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నందీశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమావాస్య ముందురోజు త్రయోదశి ప్రదోశవేళ పరమశివునికి, నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేయడం ద్వారా అన్నింటా శుభం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణలతో ఆలయం మారుమ్రోగింది. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దుల సాయినాద్, ఆలయ కమిటీ సభ్యులు, సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

'రచ్చబండ'ను విజయవంతం చేద్దాం

● కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల తలపెట్టిన 'రచ్చబండ' కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అన్నారు. బుధవారం మండలంలోని కొలకలూరులో గురువారం కార్యక్రమ ఏర్పాట్లను మస్తాన్‌వలి పరిశీలించారు.

10న జాతీయ నాస్తిక మేళా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 : ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ నాస్తిక మేళా జరుగుతుందని నిర్వాహకులు శివకృష్ణ తెలిపారు. బుధవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మంగళగిరి, నిడమర్రు గ్రామ రహదారి సమీపంలోని నాస్తిక సమాజంలో ఈమేళా జరుగుతుందని తెలిపారు. నాస్తిక, హేతువాదులు, పాల్గొనాలని కోరారు. సమావేశంలో నారాయణ, బెన్‌హర్, ప్రసాద్, శ్రీని వాస్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు